ప్రజాశక్తి

ఆదివారం 9 నవంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





11న సిఎం జిల్లాకు రాక

పిసిపల్లి మండలంలో ఎంఎస్ఇను ప్రారంభించనున్న వైనం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11న ప్రకాశం జిల్లాకు రానున్నారు. కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ (మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పార్కును సిఎం ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సిఎం పర్యటన ఏర్పాట్లల్లో కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా అధికారులు తలమునకలయ్యారు. ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటుతో సూక్ష్మ, చిన్న, తరహా పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం చేకూరనుంది. సిఎం పర్యటన నేపథ్యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు ఆదివారం ఏర్పాట్లను పరిశీలించనున్నారు. హెలీప్యాడ్ నిర్మాణం, సభాస్థలి, ఇతర ఏర్పాట్లను వారు పర్యవేక్షించనున్నారు.

సహాయనిధి చెక్కులు అందజేత



టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెం గ్రామంలో సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

మెయిన్ 6లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు
- జిల్లా మహాసభలు ప్రారంభం
- ఆకట్టుకున్న ప్రదర్శన



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-దర్శి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ప్రైవేటీకరణ విధానాలను అలవంబిస్తున్నాయని. వాటిని తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు విమర్శించారు. దర్శిలో సిఐటియు ప్రకాశం జిల్లా 13వ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. సభలో నర్సింగరావు మాట్లాడుతూ కార్మిక వర్గానికి రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల కోసం పోరాడి తెచ్చుకున్న చట్టం 8 గంటల పని విధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాతర వేశాయని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజులపాటు సమ్మె చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18నెలు

2లో



మహిళల ప్రదర్శన



ప్రదర్శనలో లెనిన్ వేషధారి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

గడిచినా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్కీం వర్కర్లు, అంగన్‌వాడీలకు జీతాలు పెంచి పర్మినెంట్ చేయమని కోరుతుంటే చంద్రబాబునాయుడు 2047 వరకూ ఆగమని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓఅడుగు ముందుకు వేసి సనాతన ధర్మాన్ని మరలా అమలు చేయాలని, కుల వ్యవస్థను తీసుకురావాలని చెప్పడం దారుణమన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జివి. కొండారెడ్డి, అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు వై సత్యవతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 4పి అమలు చేస్తానని చెప్పటం కార్మికుల హక్కులను కాలరాయటమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన, జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెల్లంపల్లి ఆంజనేయులు, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కెవి.పిచ్చయ్య, రైతుసంఘం దర్శి మండల కార్యదర్శి సందు వెంకటేశ్వర్లు, సిఐటియు దొనకొండ మండల కన్వీనర్ చిరుపల్లి అంజయ్య, సిఐటియు జిల్లా కమిటీ ముండ్లమూరు సభ్యులు బోడపాటి హనుమంతరావు, గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట తిరుపతరావు, స్థానిక నాయకులు యు.నారాయణ, వెంకటేశ్వర్లు, జాన్, ఉప్పు రమాదేవి, పాండవ లక్ష్మి, అంజిబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

సిఐటియు ప్రకాశం జిల్లా 13 మహాసభల ప్రారంభం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిఐటియు నాయకులు, కార్యకర్తలు మహిళలు ప్రదర్శనలో ముందు నిలిచారు. స్థానిక హోండా షోరూం వద్ద నుంచి ప్రదర్శన ప్రారంభమై ప్రదర్శన గడియార స్తంభం, కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డులోని సిఐ కార్యాలయం, గడియార స్తంభం సెంటర్ నుంచి ఆర్అండ్‌బి బంగ్లా వరకూ సాగింది. ఈ సందర్భంగా సుంకరవారిపాలెం గ్రామ చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరినీ అలరించింది. దర్శికి చెందిన ఉప్పు నారాయణ అధిక ధరలకు వ్యతిరేకంగా ప్రదర్శించిన భూతం వేషం ఆకట్టుకుంది.



ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు సంతనూతలపాడులో శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్ బస్సులను ముమ్మరంగా తనిఖీ చేశారు. సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఫిట్నెస్ చెకింగ్, ఫైర్ సర్వీస్ యూనిట్లను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు వాహనాల డ్రైవర్లకు సబ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు పలు సూచనలు ఇచ్చారు.

కుక్కల బెడద వీడినట్లేనా?

వీధికుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశం • ఊపిరి పీల్చుకున్న ప్రజలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఇప్పటి వరకూ వీధికుక్కలను తరలించాలంటే కోర్టు తీర్పులతో సందిగ్ధంలో ఉన్న మున్సిపాల్టీలు, పంచాయతీలకు సుప్రీంకోర్టు తీర్పుతో సమస్య వీడింది. వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించిన సంగతి తెలిసిదే. దీంతో ప్రజలు కూడా ఊపిరి పీల్చుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో కుక్కలు లేకుండా చూడాలని సూచించింది. ఇప్పటి వరకూ వీధి కుక్కల వల్ల జనం అల్లాడిపోయారు. వాటిని పట్టుకుని వ్యాక్సిన్‌లు వేసి మళ్లీ అదే వీధుల్లో వదిలేశారు. పిల్లలను, మహిళలను, వృద్ధులను విపరీతంగా కరుస్తున్నాయి. నిత్యం ఎక్కడో చోట పిచ్చికుక్క స్వైరవిహారం అంటూ పదుల సంఖ్యలో పిల్లలను కాటేశాయంటూ వార్తలు వింటూనే ఉన్నాం. స్థానిక సంస్థల్లో అధికారులు ఏమీ చేయలేకపోయారు. కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోయింది. గతంలో చేపట్టిన నియంత్రణ చర్యలు కూడా లేకపోవడంతో వీధుల్లో పిచ్చికుక్కలు విపరీతంగా పెరిగాయి. ఆహారం కోసం కరుచుకోవడం, ఏమీ దొరక్కపోతే పిల్లలను కాటేయడం వంటివి జరుగుతున్నాయి. ఇపుడు సుప్రీంకోర్టు తీర్పుతో ప్రజలకు ఊరట కలిగింది. మున్సిపాల్టీలు, పంచాయతీలు ఇకనుంచి కుక్కల పనిపట్టనున్నాయి. కుక్కలను పట్టుకుని షెల్టర్లకు తరలించాల్సి ఉంది. అక్కడే వాటికి ఆహారం అందించాలి. రోడ్ల వెంట తిరుగుతోన్న పశువులు, ఆవులను కూడా షెల్టర్లకు తరలించాలని కోర్టు సూచించింది.

12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

పెన్షనర్ల సంఘం

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలని పొదిలి పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఏ బాదుల్లా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏ బాదుల్లా అధ్యక్షతన పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు, పెన్షనర్లకు వెంటనే 12వ వేతన సవరణ కమిషన్ను నియమించి వేతన సవరణ చేయాలన్నారు. వేతన సవరణ జరగక, వాటి ఫలితాలను అనుభవించక అనేకమంది పెన్షనర్లు తనువులు విడుస్తున్నారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి మాట్లాడుతూ పెన్షనర్లకు రావలసిన మూడు విడతల డిఆర్‌ను, గత పిఆర్సి బకాయిలను, డిఆర్ బకాయిలను, పెన్షనర్లకు గత ప్రభుత్వం తగ్గించిన మూడు శాతం అడిషనల్ క్వాంటంలను పునరుద్ధరించాలని కోరారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా సరైన వైద్య సదుపాయం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు బాదుల్లా

గౌరవ అధ్యక్షులు ఏ వీరారెడ్డి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ డిఎల్ నరసింహారావు, కార్యనిర్వాహక కార్యదర్శి కేజే మోహన్‌రావు, మహిళా కార్యదర్శి డి దానమ్మ, రిటైర్డ్ హెడ్మాస్టర్, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, యల్లమందరెడ్డి, పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కులు అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకొని ప్రమాదవశాత్తు మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రమాద బీమా చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటూ భరోసానిస్తుందని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.5 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని టీడీపీ కార్యకర్తలైన ఓబురాయి సురేష్, అనుమల శ్రీనివాసులు, సగినాల విజయ్ కుమార్‌లు రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, 11వ వార్డు కౌన్సిలర్ లొక్కు రమేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, యూనిట్ ఇన్‌ఛార్జి బోయిలపల్లి కిషోర్, కాతా రామచంద్రారెడ్డి, బలగాని నరసింహులు, నంద్యాల ఈశ్వరయ్య, కర్నాటి రామసుబ్బారెడ్డి, ఆవుల రాజగోపాల్, దూదేకుల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

శిథిలావస్థలో ప్రభుత్వ పశువుల ఆసుపత్రి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం ఎన్ఎస్‌పి కాలనీలోని పశువుల ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకుంది. వర్షపు నీరు కారి రికార్డులు, పశువులకు సంబంధించిన ఔషధాలు కూడా తడిసిపోతున్నాయి. ఆసుపత్రికి సరైన రోడ్డు మార్గం లేదు. ఫలితంగా ఇది ఆకతాయిల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని చెబుతున్నారు. 2009 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ వైద్యశాల భవనానికి నిధులు మంజూరు కాగా స్థలం లేక నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. స్థానిక రెవెన్యూ అధికారులు, నాయకులు చొరవ చూపకపోవడంతో ఇంతవరకు స్థలం కేటాయింపు జరగలేదని అంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఏర్పడడం త్రిపురాంతకం మండల ప్రజల దౌర్భాగ్యం అని మండల పశు యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనవసరమైన ప్రభుత్వ భవనాలు కట్టి శిథిలావస్థకు చేరుస్తున్నారు తప్ప అవసరమైన వాటిపై శ్రద్ధ చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన పాలకేంద్రాన్ని పశువుల ఆసుపత్రిగా మార్చినట్లయితే మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పాడి రైతులు విన్నవించుకుంటున్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పశువుల ఆసుపత్రి నిర్మాణం జరిగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



త్రిపురాంతకంలోని పశువుల ఆసుపత్రి

మైనంపాడులో ఫాగింగ్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మైనంపాడు గ్రామంలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించారు. సైడ్ కాలువలను శుభ్రం చేసి ఎబెట్ ద్రావణాన్ని స్ప్రే చేశారు. శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా బ్లీచింగ్ పౌడర్‌ని చల్లారు. మైనంపాడు గ్రామ సర్పంచ్ డి రమణ, కార్యదర్శి పి రవికుమార్ దీనిని పర్యవేక్షించారు.

ప్రజాశక్తి 3
ఆదివారం 9 నవంబర్ 2025

కార్మిక ఉద్యమం బలోపేతమే ధ్యేయం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-దర్శి

కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేయటమే సిఐటియు లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు అన్నారు. శనివారం స్థానిక పిజియన్ కాంప్లెక్స్ కళ్యాణమండపంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి నగరంలో కాలం సుబ్బారావు, డీకేఎం రఫీ, పి.కల్పన, కొర్నెపాటి శ్రీనివాసరావుల అధ్యక్షవర్గంగా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభం సభను ఉద్దేశించి ముఖ్యఅతిథిగా పాల్గొని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ప్రైవేటీకరణ విధానాలను అనుసరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానాలను ఉద్యమాల ద్వారా బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీతారామయ్య ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దామా శ్రీనివాసులు జండా ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాసులు కన్వీనర్, పిసి కేశవరావు, ఈదర అన్నపూర్ణ, టి.మహేష్, జివి.రాగయ్య, ఎస్కె.అన్వర్, దాసరి మల్లికార్జున, బి.కోటేశ్వరరావు, ఊస రాజ్యలక్ష్మిలు తీర్మానం ప్రవేశపెట్టారు. మీన్స్ కమిటీ పి ఆంజనేయులు కన్వీనర్గా, టీ ఆవులయ్య, బి.మహేష్, యు.ఆదిలక్ష్మి ఉన్నారు. అర్హతల కమిటీ బంకా సుబ్బారావు కన్వీనర్గా, చీకటి శ్రీనివాసరావు, టి.రాము, పి.శ్రీనివాస రావు, ఇ.నరేంద్రలు ప్రవేశపెట్టారు. మీడియా కమిటీలు సిహెచ్ చిరంజీవి కన్వీనర్గా బత్తుల నాగేశ్వరరావు, ఆర్. మాలకొండయ్య, పిడి రవి ఉన్నారు. కల్చరల్ టి రూబెన్ కన్వీనర్గా ఉన్నారు. రిజిస్ట్రేషన్ కమిటీలోతారా శ్రీనివాస రావు కన్వీనర్గా, సిహెచ్.రాంబాబు, యు.నారాయణలు ఉన్నారు. ఈ కార్యక్రమాలలో పెద్ద ఎత్తున సిఐటియు ప్రతి నిధులు నాయకులు పాల్గొన్నారు.



సీతారాం యేచూరికి నివాళులర్పిస్తున్న నేతలు



ప్రదర్శన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కురిచేడు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం కురిచేడు రైల్వే స్టేషన్లో జరిగింది. శుక్రవారం రాత్రి కురిచేడులోని యోగయ్య స్వామి తిరుణాల జరిగింది. ఈ తిరుణాలలో నరసరావుపేటకు చెందిన శివయ్య(49) పిల్లలు ఆడుకునే బొమ్మల అమ్ముకోటానికి నర్సరావుపేట నుంచి కురిచేడుకు వచ్చాడు. తిరుణాల అయిపోయిన వెంటనే తిరుగు ప్రయాణమై స్థానిక రైల్వే స్టేషన్కి వెళ్లి నిద్రమత్తులో గుంటూరు వైపు వెళ్లే రైలు కాకుండా మార్కాపురం రైలు ఎక్కాడు. ఈ విషయం తెలుసుకొని దిగేలోపు జారి రైలు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ చేరుకునేలోగా మృతి చెందాడు.

ఆగి ఉన్న వాహనంలోని నగదు చోరీ

ప్రజాశక్తి-మద్దిపాడు

ఆగి ఉన్న వాహనంలో నగదు చోరీ జరిగింది. ఈ ఘటన మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. ఎస్సై వెంకట సూర్య వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన జి.లక్ష్మణ్ పశువుల దాణా అయినా కొబ్బరి పిట్టును మార్గమధ్యంలో విక్రయిస్తూ వచ్చిన డబ్బును వాహనంలోని డాష్ బోర్డులో పెట్టి ఏడుగుండ్లపాడు గ్రామంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద వాహనం ఆపి నిద్రపోతున్నాడు. ఉదయం లేచి చూచేసరికి తన వాహనం సైడ్ డోర్ అద్దం పగలగొట్టి డాష్ బోర్డులో నగదును దొంగిలించినట్లు బాధితుడు గుర్తించాడు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సూర్య తెలిపారు.



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఒంగోలులో జరిగిన సిపిఐ రాష్ట్ర 28వ మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సభకు హాజరైన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చంద్రబాబు పుట్టిన రోజునే వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి, ఇప్పుడు దానిని పూర్తి చేయకపోవడాన్ని జగన్ ప్రభుత్వంపై నెట్టడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేట్ చేతుల్లోకి ఇవ్వడం దోపిడీ ప్రక్రియ అని ఈశ్వరయ్య ఆగ్రహించారు. వైఎస్ఆర్సీపీ 50 శాతం సీట్లు ప్రైవేటుకు ప్రకటిస్తే, కూటమి 100 శాతం కార్పొరేట్లకు ప్రకటించిందన్నారు. వైద్య సేవలు ఖరీదైనవిగా మారాయని, ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో పేదలు వైద్యం పొందలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. పేదలకు ఇళ్లు ఇవ్వకుండా కార్పొరేట్లకు తక్కువ ధరలకు భూములు కేటాయించడం ప్రజా ద్రోహమని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట అటవీ భూములను కార్పొరేట్లకు అప్పగిస్తోందని ఈశ్వరయ్య ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం నవంబర్ 18న దేశవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దళితులు, ముస్లింలు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఒంగోలులో జరిగిన సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు విజయవంతం అయ్యాయన్నారు. పార్టీ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ప్రజానాట్యమండలిని ఆయన ప్రశంసించారు. ఒంగోలులో ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు, ఎర్ర గొడుగులతో ప్రజల భారీ ర్యాలీలు చారిత్రాత్మకంగా నిలిచాయన్నారు. సభ విజయానికి సహకరించిన కార్యకర్తలు, దాతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శిగా తిరిగి ఎంపికైన గుజ్జుల ఈశ్వరయ్యకు సిపిఐ జిల్లా కమిటీలు, అనుబంధ సంఘాలు, ఏఐటీయూసీ, మహిళా సమైక్య, విద్యార్థి, కార్మిక యూనియన్లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, సహాయ కార్యదర్శి ఆర్ వెంకట్ రావు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

'అక్టోబర్ విప్లవం' స్ఫూర్తిదాయకం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాశక్తి-దొనకొండ

దోపిడి, పీడన నుండి ప్రంచ మానవాళికి విముక్తి మార్గాన్ని చూపిన అక్టోబర్ విప్లవం ప్రపంచానికి నిత్యం స్ఫూర్తిదాయకంగా ఉంటుందని సీపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. అక్టోబర్ సోషలిస్టు విప్లవ దినోత్సవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దొనకొండలో సీపిఎం నాయకులు చిరుపల్లి అంజయ్య శనివారం అరుణ పతా కాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రంచంలో మొట్ట మొదటిసారిగా దోపిడి రహిత సమానత్వ సమాజం 1917లో సోవియట్ రష్యలో ఏర్పడిందన్నారు. ప్రకృతి వనరులుప్రభుత్వ పరం కావటం, విద్య, వైద్యం, సామాజిక బాధ్యతలన్నీ ప్రభుత్వం నిర్వర్తించటం, నిరుద్యోగం, ఆకలి చావులు, అవమానాలు, ఆత్మహత్యలు లేని వ్యవస్థ మొట్ట మొదటి సారిగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అక్కడ ప్రారంభమైందన్నారు. దాని ప్రభావంతోనే ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడ్డాయన్నారు. అనేక దేశాల్లో సోషలిస్టు వ్యవస్థలను స్థాపించాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీపిఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, నాయకులు కర్నా హనుమయ్య, కుందుర్తి చిన్న నర్శింహులు, కోలా కిరణ్, కర్ణ కృష్ణా, కె అంజయ్య, కురవటి రామయ్య, సీహెచ్ పుష్పాంజలి, ఈశ్వరమ్మ మరికొందరు కార్యకర్తలు పాల్గొన్నారు.



గౌస్ బాషాను సత్కరిస్తున్న డీఎస్పీ

పండ్ల వ్యాపారి నిజాయతీ

రూ.7 లక్షల విలువైన బంగారు ఆభరణాల బ్యాగ్ అందజేత

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పాత కూచిపూడిపల్లికి చెందిన బేతంశెట్టి మల్లయ్య కనిగిరి టౌన్ ఐస్ పార్లర్ సెంటర్లో శనివారం మధ్యాహ్నం పండ్లు కొనుగోలు చేస్తూ తన హ్యాండ్ బ్యాగ్ను అక్కడే మర్చిపోయి వెళ్లిపోయారు. తరువాత ఆ స్థలంలో ఉన్న పండ్ల వ్యాపారి షేక్ గౌస్ భాషా ఆ బ్యాగును పరిశీలించగా అందులో సుమారు రూ.7 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు ఉన్నట్లు గమనించారు. తక్షణమే షేక్ గౌస్ భాషా నిజాయితీగా ఆ బ్యాగును కనిగిరి పోలీస్ స్టేషన్లో అప్పగించారు. అనంతరం పోలీసు అధికారులు ఆ బ్యాగు యజమాని మల్లయ్యను పిలిపించి ఆ వస్తువులను అందజేశారు. మంచి మనసుతో తన వద్ద ఉన్న బ్యాగును పోలీస్ స్టేషన్కు అప్పగించినందుకు కనిగిరి డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐ షేక్ ఖాజావలి, ఎస్సై టి.శ్రీరాంలు పండ్ల వ్యాపారి షేక్ గౌస్ భాషాని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ అహ్మద్, టిడిపి జిల్లా నాయకులు తమ్మినేని వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి

కొలసనకోట సర్పంచి డొక్కా మరియమ్మ

ప్రజాశక్తి-మద్దిపాడు

మొక్కల పెంపుదలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ డొక్కా మరియమ్మ అన్నారు. మండల పరిధిలోని కొలచనకోట గ్రామంలో శనివారం ఇంటింటికి రెండు మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరియమ్మ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులందరూ సమిష్టిగా మొక్కలు పెంచి వాటిని సంరక్షించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. మనం నాటిన మొక్కలు భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటికి రెండు మొక్కలు చొప్పున పెంచాలని సూచించారు. అందులో భాగంగానే ఈ మొక్కలను అందజేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మనమందరం భాగస్వాములు అవ్వాలన్నారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త డొక్కా సిద్దయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



మొక్కలు అందజేస్తున్న సర్పంచి మరియమ్మ

దాతల సహకారం అభినందనీయం : మంత్రి

ప్రజాశక్తి-కొండపి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించడం అభినందనీయమని మంత్రి స్వామి అన్నారు. శనివారం ముప్పవరం జడ్పిహెచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన పాఠశాల ఆర్చి, గేటు, ప్రహరీ, ప్లాంటేషన్ను ఆయన ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు మంత్రి స్వామికి ఘన స్వాగతం పలికారు. హైస్కూల్ వ్యవస్థాపకుడు మద్దినేని చిన్న లక్ష్మినరస్సునాయుడు వారి మనమడు కొల్లూరి శ్రీహరి రూ.3లక్షలతో పాఠశాల పలు పనులు చేపట్టారు. పెరిదేపి గ్రామానికి చెందిన ముప్పరాజు బ్రహ్మయ్య కుమారుడు శ్రీనివాసరావు మూడు అదనపు తరగతుల గదులను రూ.5లక్షలతో నిర్మించారు. వాటర్ ప్లాంట్కు సంబంధించిన షెడ్ను ప్రధానోపాధ్యాయులు బడే కొటిరెడ్డి లక్ష రూపాయలతో నిర్మించారు. మిషనరి రూ.1.50లక్షల విలువైన వాటినితాళ్లూరి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం భార్య రమాకుమారి, కుమారులు ఇచ్చిన వాటిని ప్రారంభించారు. చిన్నం లక్ష్మినరస్సు కుటుంబం వివిద రకాల పాఠశాల అభివృద్ధికి రూ.1.50 విరాళం అందించారు. కొల్లూరి సుబ్బారావు మనమడు వెంకటేశ్వరనాయుడు తూర్పు గేటు, ఫెన్సింగ్ నిర్మించుటకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఈవో చంద్రమౌళేశ్వరరావు, యంఈవోలు సురేఖ, రామారావులు, మాజీ ఏఎంసీ చైర్మన్ జి.రామయ్యచౌదరి, సర్పంచ్ బత్తుల సులోచన, బత్తుల నారాయణస్వామి, పాఠశాల చైర్మన్ కృష్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్చిని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి



చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఏ ఆనందబాబు

సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - కొల్లూరు

మండలానికి చెందిన 8 మంది అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా చికిత్స కోసమైన బిల్లును శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి సిఫార్సు చేశారు. సిఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.5.75లక్షల విలువైన చెక్కులను తన కార్యాలయంలో లబ్దిదారులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




టెన్నికాయిడ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 2025-26కు సంబంధించిన 42వ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ బాల, బాలికల టెన్నికాయిట్ క్రీడా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. శాసన సభ్యులు ఎంఎం కొండయ్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని అన్నారు. జట్టుగా పనిచేసే మనస్తత్వం, పరస్పర సహకార భావన పెంపొందుతాయని అన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబర్చే యువతను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. చీరాల పట్టణం క్రీడా రంగంలో విశిష్ట గుర్తింపు తెచ్చుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పోటీల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, క్రీడా నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి ఫోటోలు దిగుతూ ఉత్తేజపర్చారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న వనమా రామకృష్ణారావు

ఫోరెన్సిక్ సైబర్ భద్రతపై శిక్షణ

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో నవంబర్ 10 నుండి 15 వరకు ఆన్‌లైన్ ఉపాధ్యాయ శిక్షణ నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఫోరెన్సిక్ సైబర్ భద్రత భావన, పరిశోధన, ధోరణులు, విధానాలు, సవాళ్లు, నియమాలు అమలు విధానం అనే అంశంపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల విశ్లేషణ, డేటా భద్రత, సాంకేతిక పరమైన మార్పులు, నూతన సవాళు ఎదుర్కోవడం వంటి అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రొఫెసర్లు, సాంకేతిక నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొని తమ అనుభవాలు పంచుకుంటారని తెలిపారు. సాంకేతిక వినియోగం, సైబర్ భద్రత ప్రాధాన్యం, పాలసీల రూపకల్పన వంటి అంశాలపై వివరణాత్మక చర్చలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమ బ్రోచర్ విడుదల చేశారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగాధిపతి కన్వీనర్‌గా డాక్టర్ ఇంద్రనీల్, డాక్టర్. వివి ప్రవీణ్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

పంట నష్టం లెక్కలను తారుమారు చేసిన అధికారులు

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - బాపట్ల

మొంతా తుఫానుతో భారీగా జరిగిన పంట నష్టం లెక్కలు తారుమారు చేసి రైతులను నట్టేట ముంచే విధంగా 50వేల ఎకరాల్లో పంట నష్టాన్ని తగ్గించి ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపడం ఏమిటని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ప్రశ్నించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. ప్రాథమిక నివేదిక పేరుతో 84800 ఎకరాల్లో పంటకు తీవ్ర నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం కేవలం 33750 ఎకరాల్లో పంట నష్టపోయారని 50వేల ఎకరాల్లో పంటకు నష్టం జరగలేదని అదే అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. ప్రాథమిక అంచనా అనంతరం పరిశీలిస్తే పంట నష్టం పెరగాల్సింది పోయి తగ్గడం ఏమిటని ప్రశ్నించారు. పూర్తి స్థాయిలో పంట నష్టపోయి రైతుల ఇబ్బంది పడుతుంటే అంచనాల పేరుతో నష్టపోయిన పంట తగ్గించడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మాగాణి భూముల్లో సాగు చేసిన పంట అధికంగా దెబ్బతిన్నప్పుడు 50వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంట ఈక్రాప్ లేదని, అసైన్డ్ భూముల్లో సాగు చేశారనే నెపంతో రూ.వేలు ఖర్చు పెట్టి సాగుచేసిన రైతులను కోలుకోలేని దెబ్బతీసే విధంగా దెబ్బతిన్న పంట విస్తీర్ణం తగ్గించి ప్రభుత్వానికి నివేదిక పంపడం ఏమిటని ప్రశ్నించారు. పంటలు ఈ క్రాఫ్ చేయాల్సిన ప్రభుత్వం బాధ్యతైతే వ్యవసాయ అధికారులు చేసిన పొరపాట్లకు రైతులు బలికావాల్సిందేనా అని ప్రశ్నించారు. ఈ క్రాప్ బుకింగ్ సమయంలో యాప్ ఓపెన్ కాలేదని అన్నారు. ఈక్రాప్ నమోదు కాని దెబ్బతిన్న పంట పొలాలు లెక్కల్లోకి రావని అధికారులు 50వేల పైచిలుకు ఎకరాల్లో జరిగిన పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించారని అన్నారు. దీనికి తోడు అసైన్డ్ భూముల్లో నష్టపోయిన పంటలను సైతం నమోదు చేయలేదన్నారు. పంటలు ఏవైనప్పటికీ పంట దెబ్బతిని నష్టపోయిన రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారన్నారు. కౌలు రైతులు నష్టపోయిన పంటలను పరిగణలోకి తీసుకోలేదని అన్నారు. తక్షణమే వాటిని పునః పరిశీలించి ఈక్రాప్ లేని, కౌలు రైతులు సాగుచేసి నష్టపోయిన పంటల వాస్తవ పరిస్థితులు పరిశీలించి సమగ్ర నివేదికలు పంపాలని కోరారు. జిల్లాలో సోమవారం కేంద్ర బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తే కేంద్ర బృందానికి ఏ విధంగా వివరిస్తారని ప్రశ్నించారు. పంట నష్టం జరిగిన 50వేల ఎకరాలు తగ్గించి నివేదిక పంపడం పట్ల తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. ఈ క్రాప్ బుకింగ్ కాని పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా యంత్రాంగం సరైన పరిశీలన చేసి వాస్తవంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించే విధంగా నివేదిక పంపాలని కోరారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్రా మాల్యాద్రి, నాయకులు పి కొండయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వానికి విరాళాలిస్తే ఏమైనా కట్టబెడతారా..?

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాల్యాద్రి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు మాల్యాద్రి

ప్రజాశక్తి - బాపట్ల

సిఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 అమలుకు రూ.కోట్లలో విరాళాలు ఇచ్చిన పారిశ్రామిక వేత్తలకు ప్రజలకు నష్టం జరిగే పరిశ్రమల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారాని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రకాశం బ్యారేజీ నుండి కొమ్మమూరు కాల్వ ద్వారా బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అనేక గ్రామాలకు సాగు, త్రాగునీరు అందించే కొమ్మమూరు కాలువ జలాలను కలుషితం చేసే విధంగా ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కొమ్మమూరు కాలువపై ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ పారిశ్రామికవేత్తకు కూటమి ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని అన్నారు. రూ.32.88 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించేందుకు కూటమి సర్కారు సైతం సిద్ధమైందని అన్నారు. విత్తన విక్రయ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ భూములు, పరిశ్రమలకు నీటిని తరలించే చర్యలకు ప్రభుత్వం పచ్చ తివాచీలు పరుస్తోందని అన్నారు. ఈ పథకం పూర్తయితే పర్చూరు, చీరాల, బాపట్ల, సంతనూతలపాడు నియోజక వర్గాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరందే పరిస్థితి కష్టం అవుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం 50 గ్రామాలు, 1.20లక్షల ఎకరాల సాగుకు గండి కొడుతోందని అన్నారు. పారిశ్రామిక వేత్తకు కాలువనీరిచ్చి ప్రజలకు మురుగు నీరు సరఫరా చేసేందుకు నల్లమడ డ్రెయిన్‌పై ఎత్తి ఎత్తిపోతల పథకం నిర్మించి ఆ నీటిని కొమ్మమూరు కాలువలోకి మళ్లిస్తామని చెబుతున్నారని అన్నారు. కొమ్మమూరు కాలువపై గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం చినకాకుమాను వద్ద కొత్తగా ఎత్తిపోతల (లిఫ్ట్) పథకం నిర్మించి నీటిని మళ్లిం చేందుకు సిద్ధమవడంపై కాలువ దిగువ ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ పథకం వల్ల దిగువ ప్రాంతంలో లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఎడారిగా మారుతుందని అన్నారు. బాపట్ల, చీరాల పట్టణాలతోపాటు 50 గ్రామాల పరిధిలో 5లక్షల మందికి తాగునీటి సరఫరా కష్టం అవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ పథకాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళితే ఆ ప్రాంత ప్రజలతో కలిసి సిపిఎం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు కొండయ్య పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సదస్సు

ప్రజలకు ఉచిత వైద్యం, వైద్య విద్య పేదలకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలోని ఎన్‌జిఒ భవన్‌లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి హాజరౌతారని తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వైద్యాన్ని ప్రైవేటుపరం చేయడం మానుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

వైద్య విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, వైద్య కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ బొమ్మ వద్ద నిరసన ధర్నా చేశారు. వైద్య కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ, జై భీమ్, సిపిఐ(ఎంఎల్), కాంగ్రెస్ నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్, జై భీమ్ పార్టీ ఇంచార్జ్ దోవా రమేష్ రాంజీ, సిపిఐ (ఎంఎల్) నాయకులు ఎం శోభారాణి, కాంగ్రెస్ నాయకులు కొప్పనాతి నాగబాబు, సిపిఐ నాయకులు కనీగంటి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కాలేజీలు ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ అనేక చోట్ల రాజకీయాలకు అతీతంగా ప్రజలు, మధ్యతరగతి మేధావులు నిరసన తెలుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా అర్థంలేని వాదనలు, అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రైవేటీకరణ పేరుతో ముందుకు వెళుతున్నారని అన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేస్తే వైద్యం వ్యాపారంగా మారి పేదలు వైద్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని విమర్శించారు. పేదలకు ప్రభుత్వం రంగంలో వైద్యం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నిర్మాణాలు ప్రారంభించిన 17 వైద్య కళాశాలల్లో పులివెందుల, మార్కాపురం, ఆదోని, మదనపల్లి, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ, పార్వతీపురం 10 కాలేజీలు ప్రభుత్వ నిర్వహణలో కాకుండా పిపిపి పద్ధతిలో ప్రైవేటు సంస్థలకు అప్పగించటం కూటమి ప్రభుత్వ అసమర్ధ పాలనకు నిదర్శనం అన్నారు. సామాన్య ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి ఉంచాలంటే ప్రభుత్వ రంగంలో కొనసాగాలని, నిధులు లేకపోతే రాష్ట్రంలో కార్పొరేట్ వ్యాపారవేత్తలకు రూ.లక్షలు రాయితీలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. గూగుల్ డేటా సెంటర్‌కు రూ.22 వేల కోట్ల రాయితీలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రైవేటు భాగస్వామ్యం ఉన్నప్పుడు సమాజానికి సేవచేసే విధానానికి భిన్నంగా ప్రైవేటు సంస్థలు లాభపేక్షతో పని చేస్తాయని అన్నారు. ప్రభుత్వ నిధులు, ప్రజా ఆస్తిని ప్రైవేటు వ్యక్తులకు తమ లాభాల కోసం ఇవ్వటం పొరపాటు నిర్ణయం అన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల పరిరక్షణ కమిటీగా వివిధ పార్టీల నేతలు వై కిషోర్, కె ఆశీర్వాదం, బాబురావు, కె శ్రీను, కె వాసు, ఎం ఈశ్వరరావు, డి అగస్టీన్, కె వెంకట్రావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

లక్ష మందికి కంటి చూపు లక్ష్యంగా ఏలూరు చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్ లిమిటెడ్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నివాళు లర్పించారు. 300 మంది హాజరుకాగా 120 మందిని శస్త్ర చికిత్సలకు వైద్యులు సిఫార్సు చేశారు. అధికారం, ఎన్నికలతో సంబంధం లేకుండా గత 14 ఏళ్లుగా ఒక యజ్ఞంలా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా వైద్య శిభిరాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. గతంలో రోజుకి 150 మందికి మాత్రమే శస్త్ర చికిత్సలు చేసేవారని, తాజాగా 300మందికి చేస్తున్నట్లు వెల్ల డించారు. ఎఎంసి చైర్మన్ గుంజి వెంకట్రావు, ఆదినా రాయణ, రంగయ్య తాటి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి శ్రీహరి, శంషుద్దీన్, జనార్ధన్, రజాక్ ఫారుక్, సీతయ్య, తారక రామారావు, సాంబయ్య, సురేష్, బాబు నాయక్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి 5
ఆదివారం 9 నవంబర్ 2025

నిధులు లేకుండా ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారు..?

- 'వెలిగొండ'కు రూ.4 వేల కోట్లు కేటాయించి పనులు పూర్తి చేయాలి
- శాసన మండలి మాజీ సభ్యులు కెఎస్. లక్ష్మణరావు



వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కనిగిరి

నిధులు విడుదల చేయకుండా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎలా పూర్తి చేస్తారని శాసన మండలి మాజీ సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్. లక్ష్మణరావు ప్రశ్నించారు. కనిగిరిలో వెలుగొండ సాధన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా నిధుల లేమితో నత్తనడక నడుస్తున్న వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 4 వేల కోట్లు కేటాయించి పనులు పూర్తి చేయాలన్నారు. 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ. 400 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. నిధులు లేకుండా 2026 ఆగష్టు నాటికి ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా వెలుగొండ ప్రాజెక్ట్ సాధన కోసం ఐక్య కార్యాచరణను రూపొందించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 2004లో పాలనా పరమైన అనుమతితో రూ. 960 కోట్ల అంచనాతో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.నేటికి అంచనా రూ. 10 వేల కోట్లకు పెరిగిందన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 4 వేల కోట్లు కేటాయించలేని రాష్ట్ర ప్రభుత్వం పోలవరం - నల్లమల సాగర్ పేరుతో 55 వేల కోట్లతో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమవ్వడం అవివేకమన్నారు. నీటిపారుదల ప్రాజెక్టు నిపుణులు రాచర్ల శివ ప్రసంగిస్తూ 4.47 లక్షల ఎకరాలకు సాగు నీరు, 15 లక్షల మందికి తాగు నీరు అందిస్తూ ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వెలుగొండ ప్రాజెక్టు పట్ల అలసత్వం వహించడం తగదన్నారు. వెలుగొండ తూర్పు కాలువను మాకేరు ప్రాంతానికి అనుసంధానిస్తే కనిగిరి ప్రాంత వాసుల నీటి అవసరాలు తీరుతాయన్నారు. మానవత అధ్యక్షుడు ముక్కు బాలకష్ణారెడ్డి మాట్లాడుతూ చైతన్యవంతమైన పశ్చిమ ప్రకాశం ప్రజలు గళమెత్తి ఉద్యమించి ప్రజాభిప్రాయాన్ని చాటితే ప్రభుత్వాలు దిగిరాక తప్పదన్నారు. నీటిపారుదల నిపుణులు డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మూడు కొండల మధ్య సహజ సిద్ధంగా ఏర్పడే రిజర్వాయర్‌లో నీరు నింపితే శాశ్వతంగా తాగునీటిని, సాగునీటిని వెలుగొండ ప్రాజెక్టు అందిస్తుందన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్ ప్రసంగిస్తూ నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేస్తే కోట్లాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక కనిగిరి అధ్యక్షుడు వి. మాల కొండారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం వెలుగొండ ప్రాజెక్టు పూర్తితోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సదస్సులో యుటిఎఫ్ నేత మీగడ వెంకటేశ్వర రెడ్డి, వరికపుడిసెల ఉద్యమ నేత పల్నాడు శ్రీను, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, డాక్టర్ పి. చెన్న కష్ణయ్య, జయప్రకాష్, శ్రీనివాస రెడ్డి, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి,జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె. కాజా హుస్సేన్ , రంగారెడ్డి,షేక్ జిలాని బాషా, షరీఫ్, శంకర్, వెంకట్రావు, గౌస్,ఎం.కోటిరెడ్డి ,పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు కె. కష్ణమూర్తి పాల్గొన్నారు.

తీర్మానాలు ఇవే..

పిసిపల్లి మండలాన్ని వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి తీసుకుని రావాలని, భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని పెరిగిన ధరలను దష్టిలో ఉంచుకొని నిర్ణయించి అమలు చేయాలనే తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

10న 'మీకోసం' రద్దు

కలెక్టర్ పి.రాజాబాబు వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11న జిల్లాకు వస్తున్న సందర్భంగా 10వ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన 'మీకోసం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. 'మీకోసం'లో అర్జీలు సమర్పించేందుకు దూర ప్రాంతాల నుంచి ఎవరూ జిల్లా కేంద్రానికి రావద్దని కలెక్టర్ సూచించారు.



విజేతను అభినందిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

విజేతకు ఎస్‌పి అభినందనలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ -2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డివిఎన్‌బి. రత్నబాబు, ఎ.గోపి జూడో (పెన్సెక్ సిలత్) 80-85 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు. కాంస్యం పతకం సాధించిన కానిస్టేబుళ్లను ఎస్‌పి హర్షవర్ధన్ రాజు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఒకవైపు పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ, మరోవైపు క్రీడలపై ఆసక్తితో నిరంతర సాధన చేస్తూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోనూ పోటీలు రాణించి మరిన్ని పతాలు సాధించాలని ఆకాంక్షించారు.

నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రాష్ట్రం రోజురోజుకీ నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మారుతోందని, ఉద్యోగాల కల్పన పేరుతో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అరచేతిలో వైకుంఠం చూపుతుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుద్యోగ యువతకు ఉద్యోగాల హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2.60 లక్షల వాలంటీర్లు, 16,600 మంది ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు, 25,500 రేషన్ వాహన డ్రైవర్లు, హెల్పర్లు, యానిమేటర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, ఫైబర్‌నెట్ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగించినట్లు తెలిపారు.. ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా స్కిల్ సెన్సెక్స్ సర్వే ప్రకారం 7.43 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు సుబ్బు, రామాంజీ, పవన్ పాల్గొన్నారు.

షూటింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : రాష్ట్ర స్థాయి 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైఫిల్ షూటింగ్, పిస్టల్ షూటింగ్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఒంగోలు లోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన తొలిరోజు పోటీలకు అండర్-19, అండర్-17, అండర్ -14 బాలురు, బాలికల విభాగాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 650 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, అకాడమీ కోచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌ను నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.అరవింద ప్రిన్సిపల్ .రమేష్ ప్రారంభించారు. జిల్లా విద్యా శాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ పోటీలను పర్యవేక్షిం చారు. అండర్-19 విభాగంలో విజేతలకు ప్రిన్సిపల్ మెడల్స్ అందజేశారు. ఈ పోటీలకు పభుత్వం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పూర్తి సహకారం అందిస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ చక్కా వెంకటేశ్వర్లు, ఎ.శిరీష కుమారి తెలిపారు

'ఎంఎస్‌ఎంఇ'ని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పిసిపల్లి, పామూరు

ఈనెల 11న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిసిపల్లి మండలానికి వస్తున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని లింగన్నపాలెం ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఇ పార్క్‌ను ప్రారంభించున్నారు. అందులో భాగంగా ఎంఎస్‌ఎంఇ పార్క్‌ను అధికారులతో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి శనివారం పరిశీలిం చారు.ఎమ్మెల్యే వెంట కనిగిరి డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐ ఖాజావలి, స్థానిక నాయకులు యావర శ్రీనివాసులు, పులి ప్రతాప్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

'కనకదాసు'ను స్ఫూర్తి గా తీసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కనకదాసు చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని, బాపట్ల జిల్లాను అభివద్ధి పథంలో నడిపేందుకు జిల్లా అధికారులు చిత్తశద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు.కలెక్టరేట్ లోని పిజిఆర్‌ఎస్ హాల్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కనకదాసు జయంతి శనివారం నిర్వహించారు.భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులకు, కురుప సంఘ సభ్యులకు, ప్రజలకు భక్త కనకదాసు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో కనకదాసు జయంతిని గొప్పగా నిర్వహించు కుంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కనకదాసు జయంతిని అన్ని జిల్లాలలో నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కనకదాసు శ్రీకష్ణుడి భక్తుడని తెలిపార. కన్నడ సాహిత్యం, పురాతన, మధ్య, ఆధునిక సాహిత్యంగా విడదీశారని తెలిపారు. పురాతన కన్నడ సాహిత్యం చాలా కష్టతరమైనదని, అది ఎవరికీ అర్థం కాదని, దాన్ని ఎవరూ చదవలేరని, అర్థం చేసుకుని చదివిన వారు రాజుల వద్ద నుంచి బహుమతులు పొందే వారని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా వైద్య శాఖ అధికారి విజయమ్మ, పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, కురుప సంఘ సెక్రటరీ మర్రి నాగ శేష పాల్గొన్నారు.

భక్త కనకదాసు జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భక్త కనకదాసు చిత్రపటానికి ఎస్‌పి బి.ఉమామహేశ్వర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం, హవేరీ జిల్లా బాడ గ్రామంలో 1509 లో కనకదాసు జన్మించినట్లు తెలిపారు. చిన్న వయసులోనే సమాజాన్ని వివిధ కోణాలలో గమనించిన ఆయన, నరసింహ స్తోత్రం, రామధాన్య చరిత్ర, మోహన తరంగిణి లాంటి కవిత్వాలను రచించినట్లు తెలిపారు. కనకదాసు సమాజంలో సమానత్వం, సత్యం, ధర్మం కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి పి. విజయ సారథి, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ అహ్మద్ జానీ, అడ్మిన్‌ఆర్‌ఐ మౌలుద్దీన్‌పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బాపట్ల కలెక్టర్ వినోద్ కుమార్

ఒంగోలు సిటీ : ఆధునిక కవి, తత్వవేత్త కనకదాసు తన కీర్తనల ద్వారా ప్రజల్లో సమానత్వ స్ఫూర్తిని,భక్తి భావాన్ని పెంపొందించారని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కనకదాసు జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. బీసీ సంక్షేమ అధికారి ఎస్.నిర్మల జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత డిఆర్‌ఒ చిన ఓబులేసు, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, బీసీ శాఖల సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ కనకదాసు జన్మించిన కర్నాటక రాష్ట్రంలోనే కాకుండా, ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల ప్రజల హదయాల్లోనూ ఆయనకు విశేష స్థానం ఉందన్నారు. ఆయన రచించిన కన్నడ కీర్తనలు భక్తిని, మానవత్వాన్ని నింపినట్లు తెలిపార. బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు కనకదాసు రచనల ఆధ్యాత్మికతను, సామాజిక విలువలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు లంబు నాగేశ్వరరావు, రాచూరి శ్రీనివాసరావు, లంబు రాజేంద్ర, బక్కా సాంబశివరావు, బోలె శ్రీనివాసరావు, బోలె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో నివాళులర్పిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

కొమ్మమూరుపై ఎలాంటి 'లిఫ్ట్' ప్రతిపాదన లేదు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అకాల వర్షాలకు వరద కాలువల మరమ్మత్తులు, ఆధునికరణ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని, దీర్ఘకాలిక లక్ష్యంతో భవిష్యత్తులో ఎలాంటి వరదలనైనా తట్టుకునేందుకు వరద కాలువలను ఆధునికరించి శాశ్వత పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. కొమ్మమూరు కాలువపై ఎలాంటి ఎత్తిపోతల పథకాలు నిర్మాణం చేయడం లేదని అన్నారు. వైసిపి ముసుగులో ఆందోళనలు రెచ్చగొట్టవద్దని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన 41 మందికి రూ.22,96,285 విలువైన సిఎం సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. గత పది నెల కాలంలో నియోజకవర్గంలో రూ.10 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందించామని అన్నారు. సిఎం చంద్రబాబు పెద్ద మనసుతో నిరాటంకంగా కొనసాగిస్తున్నారని అన్నారు.


పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థుల్లో సృజనాత్మక జ్వాలలు

ప్రజాశక్తి - వేటపాలెం

బాలల దినోత్సవం సందర్భంగా లలితకళా సమితి ఆధ్వర్యంలో సాహిత్య సాంస్కృతిక పోటీలు శనివారం నిర్వహించారు. స్థానిక బిబిహెచ్ హైస్కూల్‌లో 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు పద్య, లిఖిత పోటీలు నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థుల కోసం రామాయణం ఆధారంగా క్విజ్ పోటీ జరిగింది. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా బాపయ్యశెట్టి విగ్రహానికి పూల మాలలు అర్పించారు. లొల్ల శ్రీ రామమూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన సేవలు స్మరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నవంబర్ 14న సారస్వత విద్యానికేతనం గ్రంథాలయంలో బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో చల్ల వాసుదేవ, గంగాధరరావు, రవి బాబు, గొల్లపూడి సీతారాం, ఆవుల పున్నయ్య, నాగమాంబ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కృష్ణా నదిలో దూకి యువతి మృతి

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని 5వ వార్డు గరికపాటి రమాదేవి (27) పెనుమూడి, పులిగడ్డ వారధిపై నుండి కృష్ణానదిలోనికి దూకి ఆత్మహత్య చేసుకుందని సిఐ మల్లికార్జునరావు తెలిపారు. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న పెనుమూడికి చెందిన మత్స్యకారులు నదిలోకి దూకి మహిళను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆ మహిళ మృతి చెందినట్లు గుర్తించారని అన్నారు. గరికపాటి రమాదేవికి 10ఏళ్ల క్రితం లక్ష్మణరావు అనే వ్యక్తితో వివాహమై కొద్ది నెలలకే విడిపోయిందని, అప్పటి నుంచి తల్లి మహాలక్ష్మి వద్దనే ఉంటూ ఇళ్లల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మృతురాలు, ఆమె తల్లి ఇంటి పనుల విషయంలో ఒకరిపై ఒకరు గొడవ పడి మనస్తాపం చెంది మద్యాహ్నం సమయంలో పెనుమూడి వారధిపై నుండి కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామని అన్నారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్ విప్లవం కమ్యూనిస్టు పాలనకు బీజం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ విప్లవం కమ్యూనిస్టు ఆలోచనలకు, పాలనకు బీజం వేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. పట్టణంలో నిర్వహించిన మానవాళి విముక్తికి మార్గదర్శకమైన అక్టోబర్ విప్లవం వార్షికోత్సవం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మిక ఉద్యమాలు, వలస వ్యతిరేక పోరాటాలు, సామ్యవాద సిద్ధాంతాలు ఈ విప్లవం నుండి ప్రేరణ పొందాయని అన్నారు. ప్రజాతంత్ర విప్లవం జార చక్రవర్తి అధికారాన్ని కూలదోసి 1917 అక్టోబర్ 26న రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదమై ప్రజల ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్టోబర్ విప్లవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. అక్టోబర్ విప్లవం ఒక దేశపు పాలనా వ్యవస్థను మార్చటమే గాక, ప్రపంచ చరిత్ర గతిని నూతన దిశలో నడిపిన విప్లవంగా అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రపంచ మానవాళి సుఖ సంతోషాలతో జీవించాలంటే కార్మిక రాజ్యం రావాలని అన్నారు. బ్యాంకులు, రైల్వేలు, పరిశ్రమలు, విద్య, వైద్యం ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావాలని అన్నారు. ఈ విధానం ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రజా నియంత్రణ ఏర్పడిందని అన్నారు. విద్యను ఉచితంగా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావచ్చని అన్నారు. ఆరోగ్య సేవలు ప్రభుత్వ అధీనంలోకి తీసుకొచ్చి ప్రజా


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ఆరోగ్య సేవల వ్యవస్థ ఏర్పాటు చేయచ్చని అన్నారు. 1918లో కొత్త సోషలిస్టు రాజ్యాంగం ఏర్పాటు చేసి, అందులో స్త్రీలకు సమాన హక్కులు, ఉద్యోగ హక్కులు, 8గంటల పని విధానం, కార్మిక రక్షణల వంటివి చట్టబద్ధంగా అమలు జరిగాయని అన్నారు. ఈ నిర్ణయాలు రష్యాలో శతాబ్దాల నాటి అసమానతలు, దోపిడీ వ్యవస్థను కూలదోసి లెనిన్ తీసుకున్న మొదటి అడుగులు ప్రపంచవ్యాప్తంగా సామ్యవాద ఉద్యమాలకు ప్రేరణగా మారాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాధించుకున్న కార్మిక హక్కులన్నీ ఆనాడు కార్మికుల పోరాట ఫలితమే అన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక రాజ్యం ఏర్పాటుకై కృషి చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె శరత్, కార్మికులు పాల్గొన్నారు.

రమేష్ హాస్పిటల్ బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఇంకొల్లు

అనుభవం ఉన్న గుండె వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ బాబు ఇంకొల్లు వంటి గ్రామీణ ప్రాంతంలో తన ప్రాథమిక వైద్య శాఖ ప్రారంభించడం ఎంతో గొప్ప విషయమని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్టర్ రమేష్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. డాక్టర్ రమేష్‌కు తోడు ఆస్టర్ సంస్థ సంయుక్తంగా వైద్య సేవలు కొనసాగిస్తున్నారని అన్నారు. గుండె వ్యాధులకు ఈ ప్రాంతంలో ఎవరిని అడిగిన డాక్టర్ రమేష్ పేరు ప్రథమంగా చెబుతారని అన్నారు. గుండె చికిత్స కోసం చివరి దశలో ఆసుపత్రికి వెళ్లిన అనేక మంది ప్రాణాలు కాపాడిన వ్యక్తి రమేష్ అన్నారు. ఇంకొల్లు, మార్టూరు కమ్యూనిటీ సెంటర్లలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ భాగస్వామ్యంతో ఓపెన్ థియేటర్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాల్లో ప్రజలకు ఉచితంగా కార్పోరేట్ వైద్య సేవలు అందించేందుకు పిపిపి విధానంతో హాస్పిటల్లో అభివృద్ధి చేసే ఆలోచన సిఎం చంద్రబాబు చేస్తున్నట్లు తెలిపారు. సభలో వైద్యశాల చైర్మన్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో భవిష్యత్తులో మరో 10 ఏళ్లలోనే వైద్య రంగంలో సంచలన మార్పులు రానున్నట్లు తెలిపారు. ఏఐ పాత్ర వైద్య రంగంలో కీలకం కానుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ,


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఏలూరి, డాక్టర్ రమేష్

ఆయుష్మాన్ భవ తదితర ప్రభుత్వ పథకాలతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం ప్రజలకు అందుతుందని అన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత, డాక్టర్ కళ్యాణ్, ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్, యువ పారిశ్రామిక వేత్త విక్రం నారాయణరావు, పర్చూర్ ఎఎంసి చైర్మన్ గుంజి వెంకట్రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హాస్పటల్ బ్రెంచ్ ప్రారంభం సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇంకొల్లు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. గుండె, ఎముకలు, శ్వాస కోశ వ్యాధులు, గర్భకోశ వ్యాధులు, నరాలు, సాధారణ జబ్బులకు పరీక్షలు నిర్వహించారు. షుగర్, బిపి తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నూజిల్లపల్లి సొసైటీ అవినీతిలో 8 మంది అరెస్టు

రిమాండు కోసం ఒంగోలు సబ్‌జైలుకు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని నూజిళ్ళపల్లి పిఎసిఎస్‌లో మూడేళ్ల క్రితం జరిగిన కుంభకోణంలో 8మందిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిని శుక్రవారం రాత్రి న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, వెంటనే ఒంగోలు జైలుకు తరలించినట్లు అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జునరావు తెలిపారు. వివరాల్లోకెళ్తే నూజిల్లపల్లి పిఎసిఎస్‌లో రూ.2.20కోట్ల కుంభకోణం జరిగింది. (ఈ వార్త అప్పట్లోనే ప్రజాశక్తిలో ప్రచురితమైంది) ఈ కుంభకోణంలో రైతుల డబ్బుతో పాటు బంగారం మాయమైనట్లు తెలిసింది. అప్పటి వరకు జిల్లాలోనే ఆదర్శవంతమైన సొసైటీగా పేరున్న నూజిల్లపల్లి సొసైటీ అవినీతి కుంభకోణం బైటపడటంతో సంచలనం కలిగించింది. ఈ కుంభకోణంలో అప్పటి సొసైటీ అధ్యక్షులు పెండ్యాల భద్రయ్య, సొసైటీ సీఈఓ అద్దంకి రవిబాబు, సొసైటీ స్వీపర్ ఎరువుల అమ్మకం బాధ్యతలు చూసిన చెరుకూరి శివప్రసాద్ తోపాటు మరి కొంత మందిపై 51వ ఎంక్వయిరీని అధికారులు వేశారు. జిల్లా అధికారులు పరిశీలించి అవినీతి జరిగినట్లు నిర్ధారణ చేశారు. నిందితులపై ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ మేరకు రేణంగివరం పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన అప్పటి సొసైటీ అధ్యక్షులు పెండ్యాల భద్రయ్య, అప్పటి సీఈఓ అద్దంకి రవిబాబు, స్వీపర్ చెరుకూరి శివప్రసాద్, త్రి మ్యాన్ కమిటీలో సభ్యులైన కొండ్రగుంట రవిబాబు, మద్దినేని సుబ్బరామయ్య, మద్దినేని నగరాజకుమారి, పాలపర్తి పోతురాజు తోపాటు మరో వ్యక్తిని శుక్రవారం అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రేణంగివరం ఎస్ఐ వినోద్ బాబు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన అనంతరం శుక్రవారం రాత్రి న్యాయ మూర్తి ముందు హాజరు పర్చారు. ఆయన 14 రోజుల పాటు రిమాండ్ విధించారని, వెంటనే నిందితులను ఒంగోలు జైలుకు తరలించినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. మరో వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిసింది.


సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

సంతకాల సేకరణ

ప్రజాశక్తి - రేపల్లె

మాజీ సిఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా పట్టణంలో సంతకాల సేకరణ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చిమటా బాలాజీ మాట్లాడారు. ప్రజలకు కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, 27వ వార్డు ఇంచార్జ్ గౌస్, మహిళా విభాగం కన్వీనర్ వీసం నాగలక్ష్మి, పట్టణ మహిళా కన్వీనర్ బండ్రెడ్డి ఉమారాణి, వాణి, కవిత, ఖుద్దుస్, ఖాదర్ బాషా, గౌస్ ఖాన్, ఖాజా, పట్టెం శ్రీనివాసరావు, రామకృష్ణ, గోపి, శివ, భాషా, చైతన్య, పవన్, సలీం పాల్గొన్నారు.

నీరు మోటార్లతో మళ్లింపు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని చల్లారెడ్డిపాలెంలో తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి గ్రామం జలమయమైంది. నీటితో ప్రజలు మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, దోమల విపత్తు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు సహాయక చర్యలు చేపట్టారు. టిడిపి పంచాయతీ అధ్యక్షుడు కీర్తి పూర్ణ ఆధ్వర్యంలో నిలిచిన నీటిని తొలగించే పనులు వేగంగా చేస్తున్నారు. మోటార్ల సాయంతో కాలువల ద్వారా నిలిచిన నీటిని పొలాల్లోకి మళ్లిస్తున్నారు.

వచ్చేనెల 13న గుంటూరులో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబర్ 13న గుంటూరులో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యనిర్వహణ అధికారి రావూరి ఆంజనేయులు శనివారం తెలిపారు. గుంటూరు హిందూ ఫార్మసీ కాలేజీలో నిర్వహించే మెగా జాబ్ మేళాకు బ్రాహ్మణ సంఘ నిరుద్యోగ యువతీ, యువకులకు 50కిపైగా కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల పరిధిలోని బ్రాహ్మణ నిరుద్యోగ యువతీ యువకులు నవంబర్ 23లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోశాధికారి పులిపాక ప్రసాద్ తెలిపారు. వెయ్యి ఉద్యోగాలు లక్ష్యంగా నిర్వహించే ఈ జాబ్ మేళాలో ఐటి, నాన్ ఐటి, ఫార్మా, బ్యాంకింగ్, ఫైనాన్స్, హాస్పిటల్స్ తదితర రంగాల్లో అభ్యర్థుల చదువు, ప్రతిభకు తగిన విధంగా ఉద్యోగ కల్పన కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు రావూరి ఆంజనేయులు 98668 12008, పులిపాక ప్రసాద్ 98481 12396 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.


నృత్యం చేస్తున్న కోళ్లపాలెం విద్యార్థులు

విద్యార్థుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ నెల 15న జరగనున్న గిరిజన పోరాట యోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోళ్ల పాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గిరిజన నృత్య ప్రదర్శన చేపట్టారు. పాఠశాల విద్యార్థులచే ఉపాధ్యాయులు గిరిజన సాంప్రదాయ దుస్తులను ధరింపజేసి నృత్య ప్రదర్శన చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు ఉన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 9 నవంబర్ 2025

అమెరికాలో మృతి చెందిన కారంచేడు విద్యార్థిని

ప్రజాశక్తి - కారంచేడు


యార్లగడ్డ రాజ్యలక్ష్మి (ఫైల్)

అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన కారంచేడుకు చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి (23) అనారోగ్యానికి గురై మరణించిన ఘటనపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయస్సులోనే మృత్యువు ఆమెను కబళించడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అమెరికా నుంచి ఆమె మృత దేహాన్ని తీసుకొని వచ్చేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విదేశాల్లో చదువుకుంటూ ఇలాంటి దుర్ఘటనలు జరగడం వారి కుటుంబానికి పెను విషాదమని అన్నారు. రాజ్యలక్ష్మికి నివాళులు అర్పించారు. పేద కుటుంబంలో పుట్టిన ఆమె తన కుటుంబానికి అండగా ఉండాలని ఉన్నత చదువుల కోసం అమెరికాలోని టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్సిటీలో ఇటీవల పట్టా కూడా పొందిందని తెలిపారు. ఆమె మృతి పట్ల కారంచేడులో విషాదఛాయలు నెలకొన్నాయి.

చెరువులో ఈతకెళ్లి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు


మృతి చెందిన సుమంత్

మండలంలోని ఇడుపులపాడు2 సచివాలయ పరిధిలోని చెరువులో దళిత కాలనీకి చెందిన బండారు సుమంత్ తండ్రి భూషణం (16) ఈత కోసం చెరువులోకి దిగి కనిపించ కుండా పోయాడు. గ్రామస్తుల సమాచారం మేరకు తహశీల్దారు శ్రీనివాసరావు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. చెరువు ఎక్కువ లోతు ఉండటంతో గాలింపు చర్యలు చేపట్టుటకు ఎక్కువ సమయం పడుతుంది. మృతుడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుని తండ్రి కూలి చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మృతునికి ఒక అక్క కలదు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి తెలియజేసి గాలాల ద్వారా యువకుని కోసం ప్రయత్నించినా లభించలేదు. బోటు తెప్పించి బోటు ద్వారా వెతికే ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను తెప్పించి, వలల ద్వారా వెతికుతున్నారు. చెరువులో పడి మృతి చెందిన సుమంత్ మృత దేహం ఎట్టకేలకు ఎన్డిఆర్ఎఫ్ దళాలు చెరువులో గాలించి బయటకు తీశారు.

వైసిపి కార్యకర్తలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - అద్దంకి

వైసిపి కోటి సంతకాల సేకరణకు ఎదురు దెబ్బ తగిలింది. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వైసిపి నాయకులు వైద్య కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణకు వెళ్లారు. టిడిపి నాయకులు కోనేటి అనిల్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులను అడ్డుకొని నిరసన తెలిపారు. ఎన్టీఆర్ కాలనీలో గత వైసిపి నాయకులు కాలనీ వాసులపై అనేక కేసులు వేశారు. కాలనీ అభివృద్ధిని వైసిపి నాయకులు అడ్డుకుంటున్నారని కాలనీ వాసులు తెలుపుతున్నారని, తొలగించిన తరువాత కాలనీలోకి ప్రవేశించాలని సందర్భంగా తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో కాలనీవాసులు వినతి పత్రం అందించారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ కౌముది పుట్టంరాజు కళాక్షేత్రంలో డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ టీవీ చానళ్ళ గురించి వ్రాసిన గ్రంథాలపై విశ్లేషణాత్మక పరిచయం శనివారం చేశారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించారు. టీవీ ముచ్చట్లు, సమాచారం, బుల్లితెర విశ్వరూపం, సోషల్ మీడియా పుస్తకాలను గాడేపల్లి దివాకర దత్తు, జాగర్లమూడి ప్రతాప్, పాలపర్తి జ్యోతిష్మతి, ఇలపావులూరి శేషతల్ప శాయి, ఎన్ బాల సుబ్రహ్మణ్యం పుస్తకాలు పరిచయం చేసి సమీక్షలు చేశారు. డాక్టర్ యు దేవపాలన, అడుసుమల్లి అనంతకోటేశ్వరరావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సూర్యలంకలో సముద్ర స్నానాలకు అనుమతి

ప్రజాశక్తి - బాపట్ల


బీచ్‌లో రక్షణగా ఉన్న పోలీసులు

సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానాలకు పర్యాటకులను అనుమతిస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ జి రామకృష్ణ శనివారం తెలిపారు. మెంథా తుఫాను ప్రభావంతో సూర్యలంక బీచ్‌లో గుంతలు ఏర్పడిన కారణంగా పర్యాటకులు సముద్ర స్నానాలకు అనుమతించలేదని తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారడంతో బీచ్‌లో సముద్ర స్నానాలకు అనుమతిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వినోద్ కుమార్, శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ సూచనల మేరకు బీచ్‌లో సందర్శకులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. బీచ్‌లో 36 తాత్కాలిక మరుగుదొడ్లు, 90 జల్లు స్నానాలకు కుళాయిలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు 80 గదులు అడవి పంచాయతీ సహకారంతో ఏర్పాటు చేశామని అన్నారు. పోలీసు అవుట్ పోస్టులో మైక్ సిస్టమ్ ఏర్పాటు, బీచ్‌లో విద్యుత్ స్తంభాలకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్తీక మాసం ముగిసే వరకు సూర్యలంకకు వచ్చే పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేశామని అన్నారు. సూర్యలంకకి విచ్చేసే పర్యాటకులు జాగ్రత్తగా తీసుకుని ప్రమాదాలకు దూరంగా, ఆహ్లాదంగా గడపాలని కోరారు.

డాక్టర్ డేవిడ్ సన్ రాజా సాల్మన్‌కు పురస్కారం

ప్రజాశక్తి - చీరాల


సన్మానం పొందుతున్న డాక్టర్ డేవిడ్ సన్ రాజా సాల్మన్

మండలంలోని సాల్మన్ సెంటర్ పంచాయతీకి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ డేవిడ్ సన్ సౌందర రాజ్ సాల్మన్ జీవిత సాఫల్య పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. గుంటూరు వైద్య కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్వి రమణ ఆచార్యులు, ప్రిన్సిపాల్ ఎంవి సుందరాచారి, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన న్యూరాలజిస్ట్ డాక్టర్ రామకోటేశ్వరరావు, అమెరికా జింఖానా అధ్యక్షులు కె రాజాల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గత 31 ఏళ్ళుగా హెచ్ఐవి వ్యాధి గ్రస్థులకు డాక్టర్ సాల్మన్ సేవలు అందించారు. 1989లో షాడోస్ స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి తీరప్రాంతంలో హెచ్ఐవి బాధితులకు వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు, ప్యాలిటివ్ కేర్ అందిస్తున్నారు. 1992లో హెచ్ఐవి రోగులకు వైద్యం అందించిన తొలి వైద్యునిగా గుర్తింపు పొందారు. కోవిడ్ కాలంలోనూ సేవలు నిలిచిపోలేదు. ఆర్‌టీఆర్ మందులు, ఆహారపదార్థాలు పంపిణీ చేస్తూ రోగులకు అండగా నిలిచారు. ఇప్పటివరకు 17వేల మందికి చికిత్స అందించడంతో పాటు తల్లి నుండి శిశువుకు వైరస్ సంక్రమణ నిరోధించడంలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు అందుకున్న డాక్టర్ సాల్మన్ గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ నుండి జీవిత సాఫల్య అవార్డు అందుకోవడం విశేషం. ఆయన బాటలో కుమారుడు రాజా సాల్మన్ వైద్య సేవల మార్గంలో పని చేస్తున్నారు. ఆయన అవార్డు అందుకోవటం పట్ల పట్టణంలోని సీనియర్ వైద్యులు, ప్రముఖులు, ఆత్మీయులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాడి తప్పిన పంచాయతీ పాలన

గ్రామంలో ఎక్కడికక్కడ పేరుకున్న మురుగు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు పంచాయతీలో కొన్ని నెలలుగా పాలన గాడి తప్పింది. మండలంలో అత్యధిక జనాభా గలిగిన పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు కూడా దానికి అనుగుణంగానే ఉన్నారు. కానీ పాలకులు అధికారుల స్వార్థ ప్రయోజనాలతో పంచాయతీలో ఇటీవల నిధులు గోల్మాల్ కావడంతో కొందరు అధికారులు సస్పెండ్ అయ్యారు. అక్కడి నుండి పంచాయితీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సర్పంచ్ వైసీపీ ఆధ్వర్యంలో గెలుపొందటం, వెలుగు చూసిన అవినీతిలో భాగస్వామిగా ఉండటం, ఇతనిపై ఇటీవల ఉన్నతాధికారుల నుండి షోకాజ్ నోటీసులు జారీ కావడం వంటి కారణాలతో నెలకు ఒకసారి కూడా పంచాయతీకి వచ్చే పరిస్థితి లేదు. అంతేకాక పాలనా సమయం దగ్గర పడటంతో మరింత నిర్లక్ష్యంగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదే రీతిలో ఇన్చార్జి కార్యదర్శిగా ఉన్న వ్యక్తి మూడు పంచాయతీలకు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండటంతో భట్టిప్రోలుపై తగిన రీతిలో దృష్టి సారించేందుకు వీలు కుదరక పాలన మరింత కొరబడింది. గ్రామంలో మురుగు కాలువలు ఎక్కడికక్కడ పూడిపోయి పారిశుధ్యం పేరుకుపోయింది. పంచాయతీకి ఏ అధికారి బాధ్యతలు చేపట్టడానికి వచ్చేందుకు సాహసించలేకపోతున్నారు. పంచాయతీకి వివిధ రూపాల్లో ఆదాయం రూ.కోట్లలో ఉంటుంది. దానిని సక్రమంగా వినియోగించేందుకు అధికారులు ఏ ఒక్కరూ చిత్తశుద్ధిగా వ్యవహరిస్తున్న దాఖలాలు లేవు. దీని కారణంగా ఏ మాత్రం చిన్నాచితకా లోసుగులు జరిగిన వీటిపై స్థానిక నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి అధికారుల భరతం పడుతూ ఉంటారు. పారిశుధ్య నిర్వహణ కాకుండా అన్ని రకాల కార్యకలాపాలు నిలిచిపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.


గృహాల మధ్య ఉన్న మురుగు చూపుతున్న గిరిజనులు

మాల్కోడు చెరువుతో గిరిజనుల అవస్థలు

భట్టిప్రోలోని అద్దేపల్లిలోని మాల్కోడు చెరువు గిరిజన కాలనీని ఆనుకుని ఉండటమే కాక గ్రామ మధ్యంలో ఉండటంతో కురిసిన వర్షపు నీరు ఆ చెరువులోకి చేరి బయటికి వెళ్లే మార్గం లేక ప్రజలు దుర్వాసనతో అవస్థలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు తూముల ద్వారా కనగాల అప్లయేంట్ మురుగు కాలువలోకి పారుతూ ఉండేది. కానీ ఈ తూములు ఉన్న ప్రాంతాన్ని కొందరు అధికార పార్టీ బలంతో ఆక్రమించుకొని గృహాలు నిర్మించుకోవడంతో నీళ్లు వెళ్లే మార్గం లేదు. దీని చుట్టూ పెరిగిపోయిన చెట్ల ఆకులు, అలములు చుట్టుప్రక్కల వారు వేసే వ్యర్థాలతో చెరువు దుర్వాసన వెదజల్లుతుంది. అధిక వర్షాల సమయంలో పక్కనే ఉన్న ఎస్టీ కాలనీలోకి ప్రవేశిస్తుంది. ఈ నీరు రోజుల తరబడి నిలబడి దానంతట అదే భూమిలో ఇంకిపోతే తప్ప బయటకి వెళ్లే పరిస్థితి లేదని, దోమలు అంటు వ్యాధులతో అల్లాడుతున్నామని సమీప గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణకు గురైన తూములు సర్వే చేసి నూతనంగా ఏర్పాటు చేస్తే తప్ప మురుగు సమస్య తీరే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పంచాయతీ పాలలు పేరుకుపోయిన పారిశుధ్యంపై దృష్టి సారించి ప్రజలు అంటువ్యాధులకు గురికాకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఏలూరి సాంబశివరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని కుంకలమర్రులో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా రూ.80 లక్షలతో సిసి రోడ్లకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ శివారులో నిర్మితం అవుతున్న మహాప్రస్థానం వద్ద కైలాసనాథుని విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రోడ్లు, నీటి వసతులు, విద్యుత్, శానిటేషన్ తదితర విభాగాల్లో కుంకలమర్రును అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాక్ స్ట్రక్చర్ డైరెక్టర్ తిరుమల శెట్టి శ్రీహరి, షేక్ ఖాసిం, మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్, నాయకులు బంగారు బాబు, శేషయ్య, రాఘవయ్య, మణికంఠ, శ్రీనివాసరావు, శోభన్ పాల్గొన్నారు.



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

వేణుగోపాల్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల్లో గురుకుల పాఠశాల, సృజన అద్దంకి సంయుక్తంగా విజ్ఞాన విశేషాలనే అంశంపై పాఠశాల ప్రిన్సిపాల్ పి చాముండేశ్వరి అధ్యక్షతన సభ నిర్వహించారు. 8, 9 తరగతుల విద్యార్థులకు సృజన, విజ్ఞాన విశేషాలు నిర్వహించారు. సైన్స్ వ్యాసాలు రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ విద్యార్థులు ఉద్దేశించి సులభ సుందరంగా అకట్టుకునే ప్రసంగం చేశారు. శాస్త్రవేత్తల జీవిత విశేషాల గురించి వివరించారు. సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్, ఆకాశవాణి విశ్రాం త సంచాలకులు, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ ను పరిచయం చేశారు. షేక్ మహహ్మద్ రఫీ, భువనేశ్వరి, పాలపర్తి జ్యోతిష్మతి మాట్లాడారు. ఈ సందర్భంగా నాగసూరి వేణుగోపాల్‌ను ఘనంగా సత్కరించారు.

గొనసపూడిలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

చిన్నగంజాం మండలంలోని గొనసపూడిలో రావిపాటి హనుమంతరావు (91) మృతి చెందగా అతని కళ్ళను కుటుంబ సభ్యులు శనివారం దానం చేశారు. కుమారులు ప్రసాదరావు, నాగేశ్వరరావు, కోడళ్ళు, మనుమళ్లు ఆధ్వర్యంలో పెదకాకానికి శంకర్ నేత్రవైద్యశాల వైద్యులు కళ్ల కార్నియాలు సేకరించారు. నేత్ర దానం చేసిన కుటుంబ సభ్యులను వైద్యులు, సోమేపల్లి రామ్మోహన్రావు, జెట్టి స్వామి, రోటరీ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని కొనికి గ్రామ పరిధిలోని పొలాల సమీపంలోని వాగు వద్ద గుర్తు తెలియని మృత దేహం కనిపించింది. మృత దేహం బాగా చివికిపోయి గుర్తుపట్టలేని స్థితిలో వున్నది. మృత దేహం వద్ద దానికి సంబంధించిన బట్టలు, ఇతర ఆనవాలు లేవు. ఇటీవలి తుఫానుకు కొట్టుకొని వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. కొనికి విఆర్ఒ రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొరాలకింపే...

తుపాను వల్ల కురిసిన బారీవర్షాలకు జిల్లా అతలాకుతలమైంది. పంటలకు భారీ నష్టం జరిగింది. రోడ్డు దెబ్బతిన్నాయి. కోతలకు గురయ్యాయి. ముంపు సమస్య తీవ్రంగా ముందుకొచ్చింది. లోతట్టు ప్రాంతాలు నీటిలో మునిగాయి. వర్షపునీరు పోయే మార్గం లేక పొలాలు, ఊళ్లచుట్టూ నీళ్లు చేరాయి. వర్షం వీడాక సహాయకచర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన డిఆర్‌సి సమావేశంలో ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో సమస్యలపై మొర పెట్టుకున్నారు. అన్నీ విన్న ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివేదికలు తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వచ్చే డిఆర్‌సి లోపు పరిష్కారాలు చూద్దామని చెప్పి వెళ్లారు. మొరాలకింపే కనిపించింది. విపత్తులు వచ్చినపుడు వాటిపై అధ్యయనాలు కూడా కీలకం. జాతీయరహదారుల నిర్మాణంలో లోపాల వల్ల అనేక చోట్ల ముంపు సమస్య వచ్చింది. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వాగులు,వంకలు ఆక్రమించడంతో పొలాల్లో నిలబడ్డాయి. వీటిపై చర్చ సాగలేదు. ఇక సమావేశం కూడా మొక్కుబడిగానే సాగింది. సమీక్ష అరకొరగానే ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది.



గ్రానైట్ రాయల్టీ వసూళ్లు ఎఎంఆర్ సంస్థకు అప్పగించాక ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకంటే రెట్టింపు ఇవ్వాలని ఆ సంస్థ ఫ్యాక్టరీల యజమానులను డిమాండ్ చేస్తుంది. ఇదెక్కడి చోద్యమో అంతుచిక్కడం లేదు. ఇది తప్పని చెప్పే పరిస్థితిలో కూడా ప్రజాప్రతినిధులు కనిపించడంలేదు. గతంలో గనులశాఖ నిర్ణయించిన మేరకు రాయల్టీ కడుతున్నారు. ఇపుడూ ప్రభుత్వం ఎంత నిర్ణయిస్తుందో అంతే చెల్లించడం సమంజసం. అయితే టెండరు పొందిన ఎఎంఆర్ సంస్థ రెట్టింపు ఇవ్వాలని పట్టుపడుతున్నా ఎవరూ మాట్లాడటం లేదు. దానిపై మంత్రులు భేటీ నిర్వహించి కమిటీ ఒకటి ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వసూళ్లు చేయాలని ఆదేశిస్తే సరిపోతుంది. అలా కాకుండా కమిటీ అనడంతో సందేహాలు ముందుకొచ్చాయి. రెట్టింపు వసూళ్లు ఎవరికోసం ప్రజల కోసమా? ప్రభుత్వం కోసమా? లేక ప్రైవేటు వ్యక్తుల కోసమా?అనేదీ ఆలోచించాలి. సహజ సంపద నుంచే వచ్చే ఆదాయాలు వ్యక్తుల పరం చేస్తున్నారు. అందుకు ఇదే ఉదాహరణ. ఇప్పటి వరకూ గనులశాఖ వసూలు చేస్తోంది. అదే పంథాలో పోవాలి. దాన్ని స్వస్తి చెప్పి ప్రైవేటు అప్పగించడం ఇష్టారాజ్యాన్ని సూచిస్తోంది.

కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో దళితవాడల్లో రెండు చోట్ల అనూహ్య ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ రెండు నియోజకవర్గాలు ఎస్‌సి రిజర్వుడుగా ఉండటం కూడా ప్రత్యేక అంశం. చీమకుర్తి మండలం బండ్లమూడిలో దళితులపై దాడిచేశారు. దళితుల పొలంలో గొర్రెలు మేపడాన్ని ప్రశ్నించి నందుకు వారిపై దాడిచేశారు. ఇక్కడ అహంభావం,పెత్తందారీతనం ముందుకొచ్చింది. ఈ ధోరణులే అక్కడ దళితులపై దాడికి కారణంగా ఉన్నాయి. సిపిఎం, వైసిపి పార్టీలు, పలు సామాజిక సంఘాలు ధ్వజమెత్తాయి. దీనిపై పాలకపక్ష నేతలు నోరువిప్పడం లేదు. కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలం కాకుటూరిపాలెంలోనూ అంబేద్కర్ విగ్రహం చుట్టూ పిల్లర్లు తొలగింపులో అక్కడ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి.ఇక్కడా సర్పంచి,కార్యదర్శి దళిత వ్యతిరేక స్వభావంతో వ్యహరించడం వల్లనే ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయని కెవిపిఎస్ రాష్ట్ర నేత మాల్యాద్రి ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగానిదే.

కొత్త జిల్లాల ప్రక్రియ ఊపందుకుంది. వచ్చే నెలాఖరుకు మార్కాపురం జిల్లా ఏర్పాటు కానుంది. ప్రకాశంలో అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు విలీనం కానున్నాయి. ఉపసంఘం పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసింది. క్యాబినెట్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు. యంత్రాంగానికి ఇప్పటికే జిల్లాల ప్రక్రియకు అవసరమైన సమాచారం సేకరించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా కలెక్టర్లను ఆదేశించారు. కొత్తజిల్లాలకు సంబంధించిన సమాచారం సిద్ధం చేస్తున్నారు. మార్కాపురం జిల్లా ఐదు నియోజకవర్గాలు, ప్రకాశం మరో ఐదు నియోజకవర్గాలతో కొనసాగనున్నాయి. దర్శి నియోజకవర్గంలో ఒంగోలుకు సమీపంలో ఉన్న ముండ్లమూరు, తాళ్లూరు మండలాల ప్రజానీకం ప్రకాశంలోనే ఉంచాలని అభ్యర్థిస్తున్నారు. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. పశ్చిమప్రాంత ఎమ్మెల్యేలు కూడా తమకు ఇదే చివరి డిఆర్‌సి అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టు వద్దకు ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయడు ఆకస్మికంగా వచ్చారు.డిఆర్‌సి రోజునే ఆయన పర్యటన పెట్టడం హడావిడి ప్రక్రియగా కనిపించింది. ఉన్నతాధికారులు, జిల్లా ముఖ్యనేతలు అందరూ ఒంగోలులోనే ఉన్నారు. ఆయన మాత్రం వీళ్లతో తనకేంటి పని అన్నట్లుగా వచ్చి వెళ్లారు. సొంరగాలు చూశారు. ఎప్పటిలాగే రొటీన్ డైలాగ్ చెప్పిపోయారు. అదేమిటో అందరికీ తెలిసిందే. 2026 నాటికి వెలుగొండను పూర్తిచేస్తామని చెప్పారు. సిఎం చంద్రబాబు వచ్చే సీజన్‌కు నీళ్లిస్తామన్నారు. ఈయన ఏడాదిలో ఎప్పుడో స్పష్టత లేకుండా చెప్పారు. వాస్తవానికి వచ్చేఏడాదికి కూడా వెలుగొండ ప్రాజెక్టు పూర్తికావడం సాధ్యం కాదు. ఎందుకంటే జరగాల్సిన పనులు ఉన్నాయి. పునరావాసం పూర్తిచేయాలి. గ్రామాల తరలింపు ఉంది. పరిహారాలు పెండింగులోనే పెట్టారు.వీటిపై మంత్రి నిమ్మల ఏమీ స్పందించిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా వెలుగొండపై పూర్తిస్థాయిలో దృష్టిసారించాల్సిన కర్తవ్యం జిల్లా నేతలపై ఉంది.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ

- మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు
- బాపట్ల ఎస్‌పి ఉమామహేశ్వర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల ఎస్‌పి బి.ఉమామహేశ్వర్ తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను జిల్లా పోలీస్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులకు సంబంధించిన పత్రాలు, ప్రయాణికుల పట్ల భద్రతా పరంగా తీసు కుంటున్న చర్యలను పరిశీలించారు. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడానికి ప్రధానమైన కారణం మద్యం సేవించి వాహనాల నడపడమేనని తెలిపారు. దీన్ని నివారించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరిచి కఠిన చర్యలు తీసు కుంటున్నామన్నారు. ఇటీవల మార్టూరు, మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ప్రైవేటు బస్సులను


మాట్లాడుతున్న ఎస్‌పి ఉమామహేశ్వర్

తనిఖీ చేశారు. ఆ సందర్భంగా మద్యం సేవించి బస్సులు నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి వారిపై కేసుల నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తం 224 ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి నిబంధనలు పాటించని 55 వాహనాలకు రూ.1,57,405 నగదు జరిమానా విధించినట్లు తెలిపారు. నగదును చెల్లించి ప్రయాణించే ప్రయాణికులకు సౌకర్యంతో పాటుగా రక్షణ పరమైన సౌకర్యాలు కూడా పొందే హక్కు ఉందన్నారు. ప్రయాణికులు కూడా బస్సు ఎక్కేటప్పుడు అత్యవసర ద్వారం ఎక్కడుంది?, ఎలాంటి జాగ్రత్తలు బస్సు యాజమాన్యం తీసు కుంటున్నారు?, డ్రైవర్, బస్సు సిబ్బంది కండిషన్ ఎలా ఉంది గమనించాలన్నారు. భద్రత విషయం, డ్రైవర్, సిబ్బంది విషయాల్లో తేడా ఉంటే 112 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్‌పి తెలిపారు.



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

ఎయిడెడ్ టీచర్స్‌కు హెల్త్ కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్‌టిఆర్ హెల్త్ ట్రస్ట్ ద్వారా ఎయిడెడ్ ఉపాధ్యా యులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 136 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 598 మంది ఉపాధ్యాయ సిబ్బందికి ప్రతినెల జీతం నుంచి హెల్త్ కార్డు ప్రీమియం తీసుకుంటున్నారన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా ఆరోగ్య కార్డులు మంజూరు చేసి వారి కుటుంబ సభ్యులను జిల్లా యూనిట్‌గా కలెక్టర్ పూల్‌లో కారుణ్య నియామకాలు చేపట్టాలని వారు కోరారు.